క్లుప్తంగా

నేడు పూలే జయంతి ఉత్సవాల సమావేశం

రాజేంద్రనగర్: మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ మహాత్మ జ్యోతిరావు పూలే ఉత్సవ కమిటీ అధ్యక్షులు రఘుగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ జూనియర్ కళాశాల ఆవరణలోని మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల సమావేశాన్ని ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత



మణికొండ: పదవ తరగతి విద్యార్థులకు చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి ఎగ్జామ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఆయన స్థానిక నాయకులకు వాటిని అందించటంతో మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో ఎంపీ పరీక్షల ప్యాడ్‌లను అందజేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి. శ్రీరాములు, కౌన్సిలర్లు నవీన్‌కుమార్, కావ్యశ్రీ రాములు పాల్గొన్నారు.

నేడు హోలీ స్నేహ మిలన్ వేడుకలు

రాజేంద్రనగర్: మహారాణా ప్రతాప్ సేవా సమితి తెలంగాణ ప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం హోలీ స్నేహ మిలన్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అత్తాపూర్‌లోని దేవిసింగ్ ఇంజినీరింగ్ వర్క్‌షాప్‌లో భాగ్యనగర్‌లోని ఫాగ్ సర్కిల్‌లు నిర్వహించే ఈ స్నేహ మిలన్ వేడుకల్లో ఫాగ్, హోలీ పాటలు ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

ఔటర్‌పై ప్రమాదం.. డ్రైవర్‌కు గాయాలు

శంషాబాద్ రూరల్: ఔటర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. కేరళ రాష్ట్రానికి చెందిన డ్రైవర్ కె.సతీష్ ఇంధనం ట్యాంకరుతో గచ్చిబౌలి నుంచి బెంగళూరు బయలుదేరాడు. తొండుపల్లి ఔటర్ జంక్షన్ వద్ద దారి తప్పిపోవడంతో ట్యాంకరును అదే మార్గంలో వెనక్కు తీసుకెళ్తున్నాడు. ఈ సమయంలో వెనక నుంచి వచ్చిన సిమెంట్ లోడు లారీ ఈ ట్యాంకరును ఢీకొంది. లారీ డ్రైవర్ అశోక్‌కుమార్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దేవాదాయ భూమిని పరిశీలించిన తహసీల్దార్

మణికొండ: దేవాదాయ శాఖ భూమి నుంచి.. యథేచ్ఛగా ప్రైవేటు రోడ్డు అనే శీర్షికన శుక్రవారం సాక్షి కథనం ప్రచురించింది. దాంతో స్పందించిన తహసీల్దార్ రాజశేఖర్ శుక్రవారం మధ్యాహ్నం సదరు భూమి, రోడ్డును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహిపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాదాయ శాఖ భూమిలో నుంచి రోడ్డు వేయాలనుకునే సమయంలో తప్పనిసరిగా సదరు శాఖ ఎన్ఓసీ తీసుకోవాలన్నారు. అలా తీసుకోనపుడు వారు అభ్యంతరం చెబుతారన్నారు. ఉన్నతాధికారులు తనను నివేదిక అడిగితే అదే విషయాన్ని తెలియజేస్తానన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

శంషాబాద్ రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..మదన్‌పల్లికి చెందిన రుషి, గోపి(19)బైక్‌పై గ్రామం నుంచి బైక్‌పై శంషాబాద్ వెళ్తున్నారు. గ్రామ శివారులో బెంగళూరు జాతీయ రహదారిపై వీరి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ వెనక కూర్చున్న గోపి తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: చిన్నారుల జీవితాలలో కిండర్ గార్డెన్ రోజులు ఎంతో మధురమైనవని వీనస్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. శనివారం టోలిచౌకి డీలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ ప్రీప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన ప్రీప్రైమరీ పూర్తి చేసుకున్న చిన్నారులకు పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ అధ్యాపక బృందం, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సర్వీసు రోడ్డు గుండా ఉన్న నార్సింగి చెత్త డంపింగ్ యార్డు



సర్వీసు రోడ్డు గుండా ఉన్న మణికొండ చెత్త డంపింగ్ యార్డు

డంపింగ్ యార్డు వర్సెస్ సైకిల్ ట్రాక్

- చెత్త డంపింగ్ యార్డును తరలించాలని హెచ్ఎండీఏ అధికారుల ఆదేశాలు
- సైకిల్ ట్రాక్ వస్తున్నందున నిర్ణయం
- ఇప్పటికే మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు ఆదేశాలు
- ప్రత్యామ్నాయం లేదంటున్న మున్సిపాలిటీలు



చెత్త డంపింగ్ యార్డుల ముందు పెంచుతున్న గ్రీనరీ

మణికొండ: జనావాసాల మధ్యన ఉన్న చెత్త డంపింగ్ యార్డులను సంవత్సరాల తరబడి ప్రయత్నాలు, పోరాటాలు చేయటంతో ఔటర్ సర్వీసు రోడ్డు వెంట ఉన్న వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధికి రెండేళ్ల క్రితం తరలించారు. దీంతో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు చుట్టుపక్కల ఉన్న ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. రెండు మున్సిపాలిటీలకు చెత్తను తరలించేందుకు దూరాభారమైనా తప్పక అక్కడికి తరలిస్తున్నారు. అక్కడ తడి, పొడి, ప్లాస్టిక్ చెత్తలను వేరుగా చేస్తున్నారు. మిగిలిన కొంత చెత్తను జవహర్‌నగర్‌కు తరలిస్తున్నారు. అంతా సవ్యంగా ఉందనుకుంటున్న తరుణంలో ఔటర్ సర్వీసు రోడ్డు వెంట వస్తున్న సైకిల్ ట్రాక్‌తో చెత్త డంపింగ్ యార్డులను అక్కడి నుంచి తొలగించాలని హెచ్ఎండీఏ అధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ నడుమ మున్సిపల్ కమిషనర్లతో జరిగిన సమావేశంలోనూ ఈ అంశం గురించి ప్రస్తావించారు.

తలలు పట్టుకుంటున్న కమిషనర్లు...

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు రోజురోజుకు జనావాసాలతో నిండి పోతుండటం, ఎక్కడా చెత్త డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసేందుకు అనుకూల మైన స్థలాలు లేకపోవడంతో కమిషనర్లు తలలు పట్టుకుంటున్నారు. రెండు మున్సిపాలిటీల్లో చివరి గ్రామం, ఔటర్ సర్వీసు రోడ్డుకు ఉన్న చెత్త డంపింగ్ యార్డులను తరలిస్తే అందుకు అనువైన స్థలాలే లేవని వారు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీల్లో ఒక చోట కాకుండా చిన్నాచితక స్థలాల్లో రెండు, మూడు చోట్ల ఏర్పాటు చేసినా చుట్టు పక్కల ప్రజలతో ఇబ్బందులు వస్తాయని వారు వాపోతున్నారు. ఔటర్ సర్వీసు రోడ్డుకు ఉన్నా ఎలాంటి దుర్వాసన రాకుండా నిర్వహణ చేస్తున్నామని, వాటి చుట్టూరా పెద్ద షీట్లను ఏర్పాటు చేసి వాటి ముందు మంచి గ్రీనరీ సైతం ఏర్పాటు చేశామని ఉన్నతాధికారులకు వివరించారు. అదే విషయాన్ని జిల్లా కలెక్టర్‌ను సైతం కలిసి డంపింగ్ యార్డులను మరింత దూరం తరలిస్తే మున్సిపాలిటీలపై ఆర్థిక భారం పడుతుందని విన్నవించారు. దీంతో ఇప్పటి వరకైతే ఎలాంటి ఉలుకు, పలుకు లేకపోయినా మరో నెల రోజుల్లో సైకిల్ ట్రాక్ ప్రారంభోత్సవం ఉండటం, అంతలోపు ఎలాంటి ఆదేశాలు వస్తాయోనని జంట మున్సిపాలిటీల అధికారులు ఉత్కంఠంగా ఎదురు చేస్తున్నారు.

తరలించలేమని తెలిపాం



ఔటర్ సర్వీసు రోడ్డు వద్ద ఉన్న చెత్త డంపింగ్ యార్డులను తొలగించాలని గతంలో ఆదేశాలు ఇచ్చిన విషయం వాస్తవమే. వాటిని తరలించేందుకు అనుకూలమైన స్థలాలు లేవని, అక్కడే ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనసాగిస్తామని హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌ను కోరాం. వాటిని తరలిస్తే తమకు అనేక రకాల సమస్యలు ఎదురవుతాయి వివరించాం. ఇప్పటి వరకు తరుపరి ఆదేశాలు రాలేదు.

– కె.ఫల్గుణ్‌కుమార్, కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ

తిరుమలలో భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

పాల్గొన్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు గాంధీ, సుభాష్ రెడ్డి



హనుమాన్ చాలీసా పారాయణంలో మంత్రి సత్యవతి, రాథోడ్, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

గచ్చిబౌలి: తిరుమలలో 24 గంటల నిరంతర హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలసమ్మ ఫౌండేషన్, నందనపాటి బ్రదర్స్, పోలీస్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు శివ కుమార్ పర్యవేక్షణలో ఈ పారాయణం సాగింది. రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు ఆరికెపూడి గాంధీ, సుభాష్‌రెడ్డిలు పాల్గొని పారాయణం చేశారు. వీరితో పాటు పలువులు నాయకులు, కార్యకర్తలు వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. తిరుమలలో హనుమాన్ చాలీసా పారాయణం చేయడం సంతోషంగా ఉందన్నారు.

మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

శంషాబాద్ రూరల్: పట్టణంలో సిరి ఉమెన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం..

పట్టణంలోని కుమ్మరి బస్తీలో శ్రీ నర్సింహాస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గచ్చిబౌలి: చందానగర్ సర్కిల్ పరిధిలోని గౌతమీనగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసొసియేషన్ సభ్యులు శనివారం శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. గౌతమీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసొసియేషన్ చీఫ్ అడ్వైజర్ కసిరెడ్డి భాస్కర్ రెడ్డి జీహెచ్ఎంసీ వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్యతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వివరించారు. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం అధ్యక్షులు నూనె సురేందర్‌తో కలిసి వెస్ట్ జోన్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మురళీధర్, రామస్వామి, సాయికుమార్, జ్ఞానేశ్వర్, నర్సింహ ఉన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మణికొండలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న రూపారెడ్డి తదితరులు

మణికొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మణికొండ మున్సిపాలిటీ పరిధిలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి ఆధ్వర్యంలో అలిజాపూర్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలు ఆటపాటలతో అలరించారు. పలు రంగాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురు మహిళలను సత్కరించారు. బీఆర్ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధన్‌రాజ్‌తో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛభారత్



ఆస్పత్రి రోడ్డును శుభ్రం చేస్తున్న డాక్టర్ మజహర్ ఉల్లా తదితరులు

గోల్కొండ: ఆస్పత్రి పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆస్పత్రికి వచ్చే వారికి ఆహ్లాకరమైన వాతావరణాన్ని అందించే వీలుంటుందని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి ముందు గల రోడ్డుతో పాటు ఆస్పత్రిలోని రోడ్లను ఊడ్చారు. అంతేకాకుండా ఆస్పత్రి గార్డెన్‌లో పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో చెత్తను వేయడానికి వేర్వేరుగా చెత్త డబ్బాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా వేయడానికి ప్రత్యేకంగా డబ్బాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం బడాబజార్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా మహ్మద్ రవూఫ్ ఉద్దీన్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. పశువులకు శాపం



శనివారం విద్యుత్ ఘాతానికి గురై కపిలానగర్‌లో మృతి చెందిన ఆవు

బండ్లగూడ: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూగజీవాలు బలవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ శాఖ అధికారుల లోపం కారణంగా మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయని నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో ఈ సంఘటనలచోటు చేసుకుంటున్నాయి. కార్పొరేషన్ పరిధిలో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ పట్టించుకోకపోవడంతో విద్యుత్ వైర్లు ప్రమాదకారకాలుగా మారుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల ప్రాంతాల్లోని మొక్కలు, గడ్డిని తినేందుకు మూగజీవాలు అక్కడకు వెళ్లి విద్యుత్ ఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి.

విద్యుత్ ఘాతానికి గురై ఆవు మృతి...

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లో కపిలానగర్‌లో విద్యుత్ ఘాతానికి గురై శనివారం ఓ ఆవు మృతి చెందింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతమంతా తడిగామారిపోయింది. విద్యుత్ వైరు ఆవుకు తాకడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.

గతంలో సైతం...

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్, కిస్మత్‌పూర్, దర్గాఖలీజ్‌ఖాన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ షాక్‌కు గురై అనేక ఆవులు, మేకలు, గేదెలు మృత్యువాతపడ్డాయి. ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు చేయకపోవడంతో ఈ ప్రమాదాలుచోటు చేసుకుంటున్నాయని మూగజీవాల యజమానులు వెల్లడిస్తున్నారు. వేలు, లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఆవులు, గేదలు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందుతున్నాయని ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం



తేజస్వీనగర్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్ శనివారం పర్యటించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు గోతులమయంగా మారడంతో పాటు వరద నీరు రోడ్లపై నిలిచిపోవడం, డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతుండడం తదితర సమస్యలపై స్థానికుల ఫిర్యాదుల మేరకు ఆమె తేజస్వీనగర్, హైదర్‌గూడ, సాయినగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం



మొగల్స్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మొగల్స్ కాలనీలోని సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, ప్యాచ్‌వర్క్ తదితర మౌలిక సదుపయాల కల్పన కోసం శనివారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను తెలుసుకుంటామన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సాధ్యమైనతం త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మజార్, రావుల భాస్కర్, అమీరుద్దీన్ పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆస్తిపన్ను చెల్లించండి

బండ్లగూడ: ప్రజలు తమ ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కార్పొరేషన్ కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ప్రజల సౌకర్యం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ ఆస్తిపన్నును చెల్లించాలన్నారు. ప్రజలంతా సకాలంలో ఆస్తిపన్ను చెల్లిస్తే ఆ నిధుల ద్వారా కార్పొరేషన్ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తమ ప్రాంతాల అభివృద్ధికి ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ అకౌంట్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా ఆస్తిపన్నులు చెల్లించవచ్చన్నారు.

PAY PROPERTY TAX

సందడిగా కాలేజ్ డే

ఏజీవర్సిటీ: విద్యార్థుల జీవితంలో కాలేజీలో గడిపిన రోజులు తీపి గుర్తులుగా మిగిలిపోతాయని జీవితంలో మరీ ఇలాంటి రోజులు తిరిగి రావని ఐఎఫ్ఎస్ అధికారి త్రినాథ్ కుమార్, వర్సిటీ రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ అన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కాలేజీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐఎఫ్ఎస్ అధికారి త్రినాథ్ కుమార్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతలలో దేశం మంచి పురోగతి సాధించిదని అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

విద్యార్థులకు కోడ్-ఉచిత సృజనాత్మకత వర్క్‌షాప్



రాయదుర్గం: నగర విద్యార్థుల కోసం క్విక్సీ ఆధ్వర్యంలో కోడ్-ఉచిత సృజనాత్మకత వర్క్‌షాప్‌ను నిర్వహించి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. శనివారం నానక్‌రాంగూడలోని శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్ ఆవరణలో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి చెందిన సాంకేతిక నిపుణులు, సాధారణ సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి యువతను పరిచయం చేస్తున్నారు. అందులో భాగంగా ప్రముఖ నో-కోడ్ టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్ సహకారంతో ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేయడం విశేషం. క్విక్సీ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ వివేక్ గోయెల్ మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో, అభ్యాసంలో నో-కోడ్ నైపుణ్యాలు చాలా విలువైనవిగా ఉన్నాయని, వాటిని భవిష్యత్తు విజయానికి బలమైన పునాదిని అందించవచ్చన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లను విద్యార్థులకు నిర్వహించి అవగాహన పెంచితే భవిష్యత్తులో రాణించడానికి అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని బల్దియ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. శనివారం ఆయన బల్దియా సెంట్రల్ జోన్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన షేక్‌పేట్ డివిజన్‌లో పూర్తి కావాల్సిన పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. రంజాన్ నెల వచ్చే వారమే ప్రారంభమవుతుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రంజాన్ మాసంలో సాయంత్రంకాగానే మసీదుల వెళ్లే వారితో రోడ్లు రద్దీగా ఉంటాయన్నారు. అయితే సమతాకాలనీ, గుల్షన్ కాలనీతో పాటు ఎన్నో కాలనీలలోని అంతర్గత రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని, వాటికి ప్యాచ్ వర్కులు చేయించాలని ఆయన సూచించారు. అదే విధంగా మసీదుల పరిసరాలలో చెత్తను తరలించే ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

శారదా విద్యాలయంలో శతాబ్ది ఉత్సవాలు

చాంద్రాయణగుట్ట: అలియాబాద్‌లోని శారదా విద్యాలయంలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన వేడుకలకు తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా.. గౌరవ అతిథిగా ఉమెన్ సెఫ్టీ వింగ్ అడిషనల్ డీజీ అండ్ హెడ్ శిఖా గోయల్, ప్రత్యేక అతిథిగా సాక్షి మీడియా కార్పొరేట్ ఎఫైర్స్ డైరెక్టర్ రాణిరెడ్డి పాల్గొన్నారు.

ద్రాక్ష తోటల పరిశీలన

ఏజీవర్సిటీ: శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన, విశ్వవిద్యాలయం, ద్రాక్ష పరిశోధన స్థానం రాజేంద్రనగర్ సంయుక్తంగా కీసర మండలంలోని కీసర, ధర్మారం, చిట్యాల, తిమ్మాయపల్లి గ్రామాలలోని ద్రాక్ష తోటలను శనివారం సందర్శించి రైతులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ద్రాక్షతోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్రాక్ష కాయ పగుళ్ళు గమనించామన్నారు. ఈ క్షేత్ర పరిశీలనలో ద్రాక్ష పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకట రమేష్,డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

